క్లుప్తంగా

వరిధనంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

పాలకొల్లు అర్బన్: మండలంలోని వరిధనంలో ఏర్పాటు చేసిన 63 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం ఎలక్ట్రికల్ ఏడీఈ సీహెచ్ రామకృష్ణ ప్రారంభించారు. ఇప్పటి వరకు లో-ఓల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం ఆ సమస్య శాశ్వతంగా తీరిపోతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వర్ధనపు కాంతారావు, పార్టీ నాయకులు పోతులు సూరిబాబు, ద్రాక్షారపు జ్యోతి, పి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతరకు ఏర్పాట్లు

మొగల్తూరు: స్థానిక నడివీధి ముత్యాలమ్మ అమ్మవారి జాతరకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా సంక్రాంతి పండుగ నేపథ్యంలో ముక్కనుము రోజు తర్వాత వచ్చే బుధవారం లేదా ఆదివారం అమ్మవారి జాతరను నిర్వహిహిచడం ఆనవాయితీగా వస్తుంది. దీనిలో భాగంగా గురువారం అమ్మవారిని నిలబెట్టి ఘటాలను ఉంచేందుకు ముందుగా గ్రామంలో ఊరేగించి ప్రధాన రహదారి పక్కనే ఏర్పాటు చేసిన పూరిపాకలో ఉంచారు.

లక్ష్మణేశ్వరుని హుండీ ఆదాయం రూ.1.80 లక్షలు

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో ఉన్న శ్రీదుర్గా లక్ష్మణేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. దేవదాయ శాఖ భీమవరం ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన హుండీ ఆదాయ లెక్కింపులో రూ.1,80,198 ఆదాయం లభించింది. కార్యక్రమాన్ని ఈఓ సీహెచ్ సురేష్ నాయుడు పర్యవేక్షించారు.

గుంపర్రులో ధనుర్మాస పూజలు

యలమంచిలి: మండలంలోని గుంపర్రులో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గోవిందనామ పారాయణం చేశారు. ధనుర్మాసం పురస్కరించుకుని నెల రోజుల పాటు మంచినీటి చెరువు నుంచి తీర్థ బిందెతో నీరు తీసుకువచ్చి స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చక స్వామి కందవల్లి సీతారామ భార్గవ తెలిపారు.

కరుణ, త్యాగానికి ప్రతీక క్రిస్మస్

పెనుగొండ: కరుణ, త్యాగానికి ప్రతీక క్రిస్మస్ అని ఎస్సీ కమీషన్ మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు చెల్లెం ఆనంద్ ప్రకాష్ అన్నారు, గురువారం ఆచంట మండలం నీరుల్లి పాలెంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. క్రిస్మస్ ప్రతీ ఒక్కరి జీవితాల్లోనూ వెలుగులు నింపాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్ వినోద్, గొల్ల క్రాంతి, మట్టా యోహాన్, చెల్లె మోహన్‌రావు, ఖండవల్లి శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

31నే పింఛన్‌ల పంపిణీ

మొగల్తూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 31నే ఎన్‌టీఆర్ సామాజిక పింఛన్‌లు పంపిణీ చేయ నున్నట్లు ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఒకరోజు ముందుగానే పింఛన్‌లు అందజేస్తున్నామని, లబ్ధిదారులు సహకరించాలని ఆయన కోరారు.


నేడు రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి, కొత్తోట గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.రాజకిశోర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఆయా గ్రామాల్లోని రైతులు తమ భూ సమస్యలు పరిష్కరించుకునేందుకు ఈ రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పాఠశాలకు కంప్యూటర్ల అందజేత

యలమంచిలి: మండలంలోని మట్లపాలెంలో పేరిచర్ల సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం 10 కంప్యూటర్లను అందజేశారు. దివంగత పేరిచర్ల శ్రీరామచంద్ర వర్మ జ్ఞాపకార్థం డాక్టర్ సరోజిని కంప్యూటర్లు అందజేశారు. కంప్యూటర్ల గదిని గురువారం డాక్టర్ సరోజిని ప్రారంభించారు. పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పేరిచ్ల రవి వర్మ తదితరులు దాతను అభినందించారు.

విద్యుత్ బిల్లుల గుబులు





నరసాపురం పట్టణంలో ఓ చిన్న పాన్‌షాపునకు రూ.10 వేల పైనే వచ్చిన కరెంట్ బిల్లు

- సామాన్యులకు కూటమి ప్రభుత్వం షాక్
- ట్రూ-అప్, సర్దుబాటు పేరుతో భారీగా బాదుడు

నరసాపురం/పాలకొల్లు అర్బన్/పెనుగొండ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైన సంక్షేమ పథకాలు అమలుజేయకపోగా విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజల నడ్డివిరుస్తుంది. తాము అధికారంలోకి వస్తే ఒక్కరూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచమని ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీలు గుప్పించారు. బూటకపు హామీలు నమ్మిన ప్రజలు ఓట్లేసి గెలిపిస్తే ట్రూఅప్ చార్జీల పేరుతో ఓ సారి, సర్దుబాటు చార్జీలతో మరోసారి కూటమి అధికారంలోకి వచ్చిన ఈ 6 నెలల్లోనే రెండు దఫాలుగా అదనపు చార్జీలు మోపింది. ఈ చార్జీలతో నరసాపురం నియోజకవర్గంలోనే వినియోగదారులకు నెలకు రూ.1.59 కోట్ల మేర భారం పడనుంది. ఎప్పుడో గత ఏడాది వాడిన విద్యుత్‌పై ఇప్పుడు తాజాగా లెక్కలు కట్టి అదనపు చార్జీలు వేయడం ఏమిటని ప్రజలు వాపోతున్నారు. ఈ బాదుడు ఎంకెన్ని నెలలు ఉంటుదోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ కనెక్షన్లు ఇలా

నరసాపురం పట్టణంలో గృహ విద్యుత్ కనెక్షన్లు 20వేలు ఉన్నాయి. వాణిజ్య కనెక్షన్లు రెండు వేలు ఉన్నాయి. నరసాపురం మండలంలో గృహ విద్యుత్ కనెక్షన్లు 16 వేలు ఉన్నాయి. వాణిజ్య కనెక్షన్లు 500, మొగల్తూరు మండలంలో గృహ కనెక్షన్లు 13 వేలు, వాణిస్య కనెక్షన్లు 500 వరకూ ఉన్నాయి. మొత్తంగా గృహవిద్యుత్ కనెక్షన్లు 49వేలు, వాణిజ్య కనెక్షన్లు 3వేలు వరకూ ఉన్నాయి. గృహ విద్యుత్ దారులకు గతంతో పోలిస్తే గత రెండు నెలల నుంచి సగటున రూ.300 వరకూ బిల్లులు పెరిగాయి. ఈ లెక్కన గృహ విద్యుత్ వినియోగదారులకు నెల నెలా రూ.1.47 కోట్లు అదనంగా భారం పడింది. వాణిజ్య వినియోగదారులు సుమారు 3వేల మందికి నెలకు సగటున రూ.600లు లెక్కన రూ.12 లక్షలు అదనంగా బిల్లులు వస్తున్నాయి. ఇలా మొత్తంగా నెలకు నరసాపురం నియోజకవర్గ ప్రజలపై రూ 1.59 కోట్లు అదనంగా భారంపడుతుంది.

పాలకొల్లులో రూ.5.50 కోట్ల భారం

వినియోగదారులు వాడిన యూనిట్లపై సర్దుబాటు చార్జీలు 40 శాతం పెరగనుంది. పాలకొల్లు సబ్‌డివిజన్‌లో వీరవాసరం మండలంలో 25 వేల గృహ విద్యుత్ కనెక్షన్‌లు, పాలకొల్లు మండలం 23,756 కనెక్షన్‌లు, పాలకొల్లు పట్టణంలో 27,784, యలమంచిలి మండలంలో 24 వేల విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. పాలకొల్లు సబ్ డివిజన్‌లో ప్రతీ నెలా రూ.9.38కోట్లు, యలమంచిలి మండలంలో రూ.2.40 కోట్లు విద్యుత్ బిల్లులను వినియోగదారులు చెల్లిస్తున్నారు. వచ్చే జనవరి నుంచి 40 శాతం పెరిగితే అదనంగా వినియోగదారులపై రూ.5.50 కోట్లు భారం పడనుంది.

రైసుమిల్లులపై తీవ్ర ప్రభావం

సార్వా సీజన్ కావడంతో రైసు మిల్లులు ప్రస్తుతం ధాన్యం ఆడే పనిలో ఉన్నాయి. ఇవన్నీ విద్యుత్‌పై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. ఈ తరుణంలో ట్రూ అప్ చార్జీల మోతతో ఒక్కో మిల్లు రూ.10 వేలకు పైగా చెల్లించాల్సి ఉంటుందని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చే స్తున్నారు. ఇప్పటికైనా ట్రూ-అప్ చార్జీల భారాన్ని రద్దు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పోరుబాట

కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ప్రజలకు అండగా నేడు పోరుబాట నిర్వహిస్తోంది. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు నరసాపురం ఎలక్ట్రికల్ ఈఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించిన అనంతరం అధికారులకు వినతి పత్రం ఇవ్వనున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉదయం 9 గంటలకు రైల్వే స్టేషన్ రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి చేరుకోవాలని ముదునూరి సూచించారు. అక్కడ నుంచి మోటార్‌సైకిల్ ర్యాలీగా ఈఈ కార్యాలయానికి చేరుకుని ఆందోళన నిర్వహిస్తారు.

పాలకొల్లులో..

పెంచిన విద్యుత్ చార్జీలు తక్షణం తగ్గించాలని డిమాండ్ చేస్తూ పాలకొల్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు ఆధ్వర్యంలో శుక్రవారం పోరుబాట కార్యక్రమం చేపట్టారు. ఉదయం 9.30గంటలకు పూలపల్లి అంబేడ్కర్ సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి పాలకొల్లు మండలం యాళ్లవానిగరువు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం ఏడీఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించనున్నారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరానున్నారు.





నవంబరులో చెల్లించిన బిల్లు
డిసెంబరులో చెల్లించిన బిల్లు

ఆచంటలో..

వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో ఆచంట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు.

గతంలో రూ.150 బిల్లు వచ్చేది



మాది చిన్న పూరి గుడిసె. ఇంట్లో ఓ ఫ్యాన్, రెండు ట్యూబ్‌లైట్లు ఉంటాయి. అదీ నేను పెద్దగా కరెంట్ వాడను. ఇంట్లో టీవీ కూడా లేదు. గతంలో రూ.150 కరెంట్ బిల్లు వచ్చేది. ఇప్పుడు రూ.600 బిల్లు వస్తుంది. రూ.500 వరకూ బిల్లు పెరిగింది. ఇలాగైతే కరెంట్ బిల్లులు ఎలా కట్టేది? నాకు వచ్చే పింఛన్‌లో అధిక భాగం కరెంట్ బిల్లుకే సరిపోతుంది.

–మేడిది సావిత్రి, సీతారామపురం

కరెంట్ బిల్లులు తగ్గించాలి



కరెంట్ బిల్లులు తగ్గించాలి. గతంలో కంటే చాలా ఎక్కువగా బిల్లులు వస్తున్నాయి. ఇంకా ముమ్ముందు పెరుగుతాయని అంటున్నారు. ఎన్నికలప్పుడు కరెంట్ బిల్లులు పెంచమని చెప్పారు. ఇప్పుడు చూస్తే కరెంట్ బిల్లులు కట్టడానికే ఎక్కడి నుంచి డబ్బులు తేవాలో అర్థం కావడంలేదు. కరెంట్ బిల్లులు భారాన్ని తగ్గించి ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి.

– నల్లి చిట్టికుమారి, సీతారామపురం సౌత్ పంచాయతీ

పేదలపై పెను భారం



ట్రూఅప్ చార్జీల పేరుతో పేదలపై పెనుభారం మోపారు. రెండు సార్లు అదనపు భారం పడడంతో బిల్లులు చెల్లించలేకపోతున్నారు. ప్రతి పేద కుటుంబం రూ.200లకు పైగా అదనంగా చెల్లించాల్సి వస్తుంది. మోసపూరితంగా భారం మోపారు. తక్షణం ట్రూఅప్ చార్జీలు విరమించుకోవాలి.

– షేక్ పాదుషా, పెనుగొండ

ఎమ్మెల్యే భూపతిరెడ్డిపై చర్యలు తీసుకోవాలి


గంటా రాజు

పెనుగొండ: తెలంగాణ ఎమ్మెల్యే భూపతి రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఏపీ ప్రజలను కించపరిచేవి ధంగా ఉన్నాయని సౌత్ ఇండియా కాపు అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు గంటా రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే భూపతి రెడ్డి పై కఠిన చర్యలు తీసుకోవాలంటూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసినట్లు పేర్కొన్నారు. సినీ నటులను బెదిరించేలా వ్యాఖ్యలు చేయడం చట్టవిరుద్ధమని మండిపడ్డారు. భూపతిరెడ్డిని తక్షణం అరెస్ట్ చేయాలని కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

యలమంచిలి: రైతుల సమస్యలు పరిష్కరించుకోవడానికి రెవెన్యూ సదస్సులు చక్కని వేదికగా ఉపయోగపడతాయని ఆర్డీఓ దాసి రాజు చెప్పారు. మండలంలోని కొంతేరులో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రైతుల నుంచి వినతులు స్వీకరించారు. రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలు, సర్వేలు, పట్టాదారు పాస్ పుస్తకాలు తదితర సమస్యలు పరిష్కారం కానున్నాయన్నారు. సర్వే, పట్టాదారు పాస్‌పుస్తకం తదితర సమస్యలపై 9 మంది రైతులు అర్జీలు అందజేశారు. అలాగే అడవిపాలెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 15 అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రంధి జీఎస్‌వీ పవన్‌కుమార్, ఆర్‌ఐ యశోద, వీఆర్వోలు జీవీవీ సత్యనారాయణ, నీటి సంఘం అధ్యక్షుడు తానెంకి వెంకట కృష్ణారావు, పులపర్తి సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.


యలమంచిలి: కొంతేరులో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ దాసి రాజు

పెదమైనవానిలంకలో...

నరసాపురం రూరల్: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదం చేస్తాయని ఆర్డీఓ దాసి రాజు అన్నారు. నరసాపురం మండలంలోని పెదమైనవానిలంక గ్రామంలో గురువారం నిర్వహించిన రెవిన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ రెవెన్యూ అధికారులే మీ గ్రామానికి వచ్చి సమస్యలపై అర్జీలు తీసుకుంటున్నందున ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ధర్బరేవు గ్రామంలో జరిగిన సభలో 53, అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన రెవిన్యూ సదస్సులో 3 అర్జీలు అందినట్లు డిప్యూటీ తహసీల్దార్ ఎన్‌ఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో మిరియాల లక్ష్మీనారాయణ, వీఆర్వోలు మెహర్‌బాబా, చిరంజీవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పోరుబాటను విజయవంతం చేయాలి


పెండ్ర వీరన్న

నరసాపురం రూరల్: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టనున్న విద్యుత్ పోరుబాటను విజయవంతం చేయాలని ఆపార్టీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న పిలుపు నిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గడిచిన ఎన్నికల్లో కూటమి నాయకులు రాష్ట్ర ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు చేసి ఓటర్లను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారన్నారు. అధికారం చేపట్టిన ఏడాదిలోనే విద్యుత్ చార్జీలను పెంచడమే కాకుండా గత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు 200 యూనిట్ల వరకూ ఉచితంగా విద్యుత్ వినియోగించుకునే అవకాశాన్ని ఎత్తివేసిందని విమర్శించారు. అంతే కాకుండా విద్యుత్ సంస్కరణల పేరుతో కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసే విధంగా ఈ చంద్రబాబు ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని మండిపడ్డారు. దీంతో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రాల్లో తలపెట్టిన విద్యుత్ పోరుబాట కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని వీరన్న కోరారు.

ఉద్దరాజు రామం పుస్తకావిష్కరణ

నరసాపురం: సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు గురువారం పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 11గంటలు నుంచి సాయంత్రం 5 గంటలు వరకూ రెండు సెషన్స్‌లో పార్టీ రాష్ట్ర కమిటీ నాయకులు అంతర్గతంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా అవలంభించాల్సిన ఉద్యమ ప్రణాళికపై నాయకులు సుదీర్ఘ చర్చ చేశారు. శుక్రవారం చివరిరోజు జరిగే సమావేశంలో తీర్మానాలను విడుదల చేయనున్నారు. రాత్రి 7 గంటలకు రాష్ట్రంలో కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన ఉద్దరాజు రామం జీవిత విశేషాలతో ప్రచురితమైన పుస్తకాన్ని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మరో పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎంఏ బేబీ, పార్టీ కేంద్ర కమటి సభ్యుడు ఎంఏ గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదరిశ వర్గసభ్యులు, మంతెన సీతారామ్, కె.రమాదేవి, ఉద్దరాజు రామం తనయుడు ఉద్దరాజు బాపిరాజు, డీవీఎస్ వర్మ, చింతకాయన బాబూరావు, కవురు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.


ఉద్దరాజు రామం పుస్తకావిష్కరణ చేస్తున్నదృశ్యం

మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడికి పరామర్శ

నరసాపురం రూరల్: మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు తండ్రి ప్రతాపనాయుడు ఇటీవల మరణించారు. దీంతో గురువారం నరసాపురం సరిపల్లి గ్రామంలోని ఆయన నివాసంలో మాధవనాయుడును వైఎస్సార్ సీపీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పెండ్ర వీరన్న పరామర్శించారు. ఈయన వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

పెనుగొండ: భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను రాజ్యసభలో అవమానకరమైన రీతిలో వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘ జిల్లా కమిటీ సభ్యులు కప్పల రత్న రాజు డిమాండ్ చేశారు. గురువారం సిద్ధాంతంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించి, అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 30న అఖిల పక్షాల నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు.

ఘనంగా వంగవీటి మోహనరంగా వర్ధంతి

పాలకొల్లు అర్బన్: బడుగుల ఆశా జ్యోతి వంగవీటి మోహనరంగా అని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గుణ్ణం నాగబాబు అన్నారు. వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని మారుతీ థియేటర్ వద్ద ఉన్న వంగవీటి రంగా విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, వైఎస్సార్ సీపీ నాయకులు యడ్ల తాతాజీ, చేగొండి సూర్యప్రకాష్, అడబాల వెంకటరమణ, రంగ విగ్రహ కమిటీ అధ్యక్షుడు మండెల రజని, పట్టణ ప్రముఖులు వంగా నరసింహారావు, యర్రంశెట్టి వెంకటరత్నం, బోనం చినబాబు తదితరులు పాల్గొని రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.


పాలకొల్లులో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అధ్యాపకుడికి డాక్టరేట్

నరసాపురం రూరల్: మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడు కేసరి కోటేశ్వరరావుకు డాక్టరేట్ లభించింది. సింథసీస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ రేర్ యర్త్ డోప్డ్ సిఏ3, ఎఎల్2ఓ 6ఫాస్ఫర్ ఫర్ డిస్ప్లే డివైజ్ అప్లికేషన్ అనే అంశంపై చేసిన పరిశోధనకు ఆయన డాక్టరేట్ సాధించారు. కృష్ణా యూనివర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ అండ్ కన్వీనర్ డాక్టర్ ఎంసీ రావు, పీజీ బోర్డ్ ఆఫ్ చైర్మన్ ప్రొఫెసర్ కె సమత, పలువురు ప్రొఫెసర్ల పర్యవేక్షణలో ఆయన ఈ పరిశోధన చేశారు. డాక్టరేట్ సాధించిన కోటేశ్వరరావును స్వర్ణాంధ్ర కళాశాల చైర్మన్ కె.సత్యనారాయణ, ట్రెజర్ కె.త్రినాథ వెంకటేశ్వరస్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి తదితరలు అభినందించారు.

రేపు సచివాలయ భవనం ప్రారంభం

పెనుమంత్ర: మండలంలోని వెలగలవారిపాలెం గ్రామంలో రూ.43.50 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని శనివారం మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ప్రారంభిస్తారని సర్పంచ్ వెలగల సుగుణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ భవనాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరై భవననిర్మాణ పనులు ప్రారంభించి పూర్తి చేశారు. అనంతరంఎన్నికలు రావడంతో ప్రారంభోత్సవం నిలిచిపోయింది. ఎన్నికల అనంతరం ఆరు లక్షల పంచాయతీ నిధులు వెచ్చించి మైనర్ పనులను పూర్తి చేశారు.

ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం


కర్రా జయసరిత,


పాలకొల్లు అర్బన్: విద్యుత్ చార్జీలను పెంచి కూటమి ప్రభుత్వం ప్రజల్ని మోసం చేసిందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి కర్రా జయ సరిత విమర్శించారు. ఈ మేరకు గురువారం జయసరిత ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు విద్యుత్ ఛార్జీలు పెంచమని ప్రజలకు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల కాలంలోనే రూ.15వేల కోట్లు భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శీతాకాలంలో తక్కువగా వాడుకునే వినియోగదారులు వేసవికాలంలో మాదిరిగా ప్రభుత్వం బిల్లులు వసూళ్ల చేయనుందని మండిపడ్డారు.

జోరుగా దాళ్వా సాగు

మొగల్తూరు: దాళ్వా సాగుకు ఆరంభంలోనే రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే సార్వా సాగు తగ్గిపోవడంతో ఆందోళన చెందుతున్న రైతులు దాళ్వా సాగులో కూడా ఇదే పరిస్థితి ఏర్పడటంతో రైతులకు ఏమి చేయాలో పాలుపోవడంలేదు. ప్రతిఏటా సార్వా సాగు రెండు వేల ఎకరాల్లో చేసేవారు. సాగు ఆరంభంలోనే తరుచుగా వర్షాలు పడటంతో కేవలం 640 ఎకరాలకు పరిమితమైంది. దాళ్వా సాగు గతంలో మూడు వేల ఎకరాల్లో చేయగా ఈ ఏడాది అధికారుల అంచనాల ప్రకారం సుమారు 2399 ఎకరాల్లో మాత్రమై రైతులు సాగు చేసే అవకాశం ఉంది. అయితే ముందుస్తు దాళ్వా సాగుచేపడదాయని రైతులు సాగుకు సిద్ధం కాగా గత వారం రోజులుగా వాతావరణ మార్పులతో రైతులు చేపట్టిన సాగు పనులు ముందుకు సాగడంలేదు.

2399 ఎకరాల్లో దాళ్వా సాగు

మండలంలోని 17 ఎకరాలకు సంబంధించి 2399 ఎకరాలలో దాళ్వా సాగు చేపట్టవచ్చని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారడంతో గత వారం రోజులుగా మబ్బులు, చిరుజల్లులు, ఈదురుగాలులతో కూడిన వాతావరణం రైతులను ఆందోళనకు గురి చేస్తుంది. రామన్నపాలెంలో ఆకుమడులు వేసకునేందుకు దుక్కులు దున్నతుండగా, శేరేపాలెం పంచాయతీ పాలకమ్మ చెరువులో నాట్లు వేస్తున్నారు. మొగల్తూరు పంచాయతీ గరువుపల్లవపాలెంలో ఆకుమడులు చుట్టూ వర్షపు నీరు చేరడంతో నీటిని బయటకు తోడేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. వ్యవసాయాధికారుల అంచనా ప్రకారం 2399 ఎకరాల దాళ్వాసాగుకు సంబంధించి 120 ఎకరాల్లో ఆకుమడులు వేయాల్సి ఉండగా, ఇప్పటి వరుకు కేవలం 50 ఎకరాలలోనే ఆకుమడులు వేశారని, 20 ఎకరాలలో మాత్రమే నాట్లు వేసినట్లు వ్యవసాయాదికారి అబ్దుల్ రహీమ్ తెలిపారు. సార్వా సాగుకు సంబందించి ఇంకా సుమారు 50 ఎకరాలు దాకా కోతలు కోసి ధాన్యాన్ని ఒబ్బిడి చేయాల్సి ఉందని వివరించారు.


రామన్నపాలెంలో దుక్కులు దున్నుతున్న ట్రాక్టర్


పాలకమ్మ చెరువులో నాట్లువేస్తున్న కూలీలు